సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం, 12, సెప్టెంబర్, 2024



తృణధాన్యాలతో ఆరోగ్యం

రక్తహీనతను తదితర తృణ ధాన్యాల ద్వారా అధిగమించవచ్చని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. 8లో



చట్రాపల్లిని అన్నివిధాలా ఆదుకుంటాం 8లో

చట్రాపల్లిని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఐటీడీఏ పీవో అభిషేక్ హామీ ఇచ్చారు.



అటవీ అమరవీరులకు ఘన నివాళి

జిల్లాలో అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. 8లో

న్యూస్‌రీల్

గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు బదిలీ

- రజనీకి ఇన్‌చార్జి బాధ్యతలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ

సాక్షి,పాడేరు: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాడేరు గిరిజన సంక్షేమ డీడీ కొండలరావును బదిలీ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో ఇన్‌చార్జి డీడీగా పాడేరు ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీని నియమించారు. జి.మాడుగుల మండలం బందవీధి ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు గోడదూకి వెళ్లి పాడేరులో కనిపించారు. ఇదే ఆశ్రమంలో మెనూ సక్రమంగా అమలు కాలేదని ఆయనపై కలెక్టర్‌కు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఫిర్యాదు చేశారు. డుంబ్రిగుడ మండలం జామిగుడ ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని వంద మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన ఘటనలోను డీడీ పర్యవేక్షణ లోపం ఉందంటూ విమర్శలు వెల్లువెత్తారు. దీనిపై పలువురు ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీడీ కొండలరావును రంపచోడవరం బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

తెరచుకోని చాపరాయి



ఉధృతంగా ప్రవహిస్తున్న చాపరాయి గెడ్డ

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయి ఐదు రోజులుగా తెరచుకోవడం లేదు. చాపరాయి జలపాతం ఉధృతి తగ్గలేదు. జలపాతం సాధారణ స్థితికి వచ్చేవరకు చాపరాయిని తెరవ వద్దని కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. ఈవిషయం తెలియని మైదాన ప్రాంత ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

కేకే లైన్‌లో రైళ్లు గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: బచేలి–కిరండూల్ మధ్య కురుస్తున్న భారీ వర్షాలు, భద్రతా కారణాల దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటాయి.

తిరుపతి–శ్రీకాకుళం రోడ్ స్పెషల్ రద్దు

నిర్వహణ కారణాల దృష్ట్యా తిరుపతి–శ్రీకాకుళం రోడ్–తిరుపతి మధ్య నడుస్తున్న స్పెషల్ రైళ్లు డిసెంబరు వరకు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. తిరుపతి–శ్రీకాకుళం రోడ్ (07440) స్పెషల్ అక్టోబరు 6వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు, శ్రీకాకుళం రోడ్–తిరుపతి(07441) స్పెషల్ అక్టోబరు 7వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రద్దు చేశారు.

జ్వరంతో నాలుగేళ్ల చిన్నారి మృతి



జెసికా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

సాక్షి,పాడేరు: అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ, పోర్నపాదరు గ్రామానికి చెందిన చిన్నారి పాంగి జెసికా(4) జ్వరంతో మృతిచెందింది. గత రెండు రోజుల నుంచి బాధపడుతున్న ఆమెను తల్లిదండ్రులు బుధవారం అనంతగిరి పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు కల్పించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం జిల్లా ఎస్.కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. వైద్యసేవలు పొందుతునే చిన్నారి జెసికా రాత్రి 9.30గంటల సమయంలో మృతిచెందింది.జెసికా మృతితో తల్లిదండ్రులు దాసు,జ్యోతిలు బోరున విలపించారు. ఈవిషయం తెలుసుకున్న అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్.కోట ఆస్పత్రికి చేరుకుని సమాచారం సేకరించారు. తల్లిదండ్రులను పరామర్శించారు.చిన్నారి మృతదేహాన్ని పోర్నపాదరు గ్రామానికి తరలించేందుకు ఎంపీపీ తగిన ఏర్పాట్లు చేశారు.

ముంచెత్తిన నీళ్లు.. తేరుకోని ఊళ్లు

చింతూరు: వరద ముంపులో శబరిఒడ్డు, సంతపాకల ప్రాంతాలు



ఉగ్రరూపం దాల్చిన గోదావరి శబరి నదుల నీటిమట్టాలు తగ్గుముఖం పట్టినా ముంపునుంచి ఇళ్లు, రహదారులు బయటపడలేదు. విలీన మండలాల్లో 113 గ్రామాల పరిస్థితి దయనీయంగానే ఉంది. వరద తగ్గుముఖం పట్టకపోవడంతో మంగళవారం నుంచి ఇవి ముంపులోనే ఉన్నాయి. దీంతో బాధితులు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు.

- గోదావరి, శబరి శాంతించినా తగ్గుముఖం పట్టని ముంపు
- దయనీయంగా 113 గ్రామాల పరిస్థితి
- వరద నీరు తగ్గకపోవడంతో పునరావాస కేంద్రాల్లోనే బాధితులు
- 2,217 కుటుంబాలపై ప్రభావితం
- కొనసాగని రాకపోకలు



చింతూరు: వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



ఎటపాక: జాతీయ రహదారిపై వరద



ఎటపాక: గౌరిదేవిపేట పీహెచ్‌సీ రహదారిని చుట్టుముట్టిన వరద

చింతూరు: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు తగ్గడంతో గోదావరి, శబరి నదులు శాంతించాయి. ఈ రెండింటి నీటిమట్టాలు బుధవారం తగ్గుముఖం పట్టడంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు భద్రాచలం వద్ద గరిష్టంగా 50.3 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం పది గంటల వరకు నిలకడగా ఉంది. ఆ తరువాత నుంచి క్రమేపీ తగ్గుతోంది. రాత్రి 9 గంటలకు నీటిమట్టం 47.5 అడుగులకు తగ్గడంతో రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. . చింతూరు వద్ద శబరి నీటిమట్టం బుధవారం ఉదయానికి 45 అడుగులకు చేరుకుంది. అక్కడినుంచి క్రమేపీ తగ్గుతూ రాత్రికి 43 అడుగులకు చేరుకుంది.

ముంపులో 113 గ్రామాలు

గోదావరి, శబరి వరద కారణంగా చింతూరు మండలంలో 42, వీఆర్‌పురం మండలంలో 41, కూనవరం మండలంలో 30 గ్రామాలు ముంపునకు గురయ్యాయి.

- చింతూరు మండలంలో 884, కూనవరం మండలంలో 575, వీఆర్‌పురం మండలంలో 758 కుటుంబాలకు చెందిన 6,385 మంది వరదకు ప్రభావితం కాగా వీరిని ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు, సమీప సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు అందచేశారు.
- చింతూరు మండలంలో శబరినది శాంతించడంతో వరదనీరు క్రమేపీ తగ్గుతోంది. చింతూరులోని శబరిఒడ్డు, సంతపాకలు, టోల్‌గేట్ సెంటర్‌తో పాటు కుమ్మూరు, చట్టి, ఏజీకొడేరులో నీట మునిగిన ఇళ్లు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి.
- చింతూరులోని టోల్‌గేట్ ప్రాంతంలో బుధవారం ఉదయం వరకు ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహించిన వరదనీరు మధ్యాహ్నం తగ్గుముఖం పట్టింది. దీంతో చట్టికి రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి.
- వరదలకు వీఆర్‌పురం మండలంలో 11, కూనవరం మండలంలో 14, చింతూరు మండలంలో 13, ఎటపాక మండలంలో 10 ప్రాంతాల్లో రహదారులు ముంపునకు గురయ్యాయి. ఆంధ్రా నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణకు సుమారు 150కు పైగా గ్రామాలకు, రాకపోకలు నిలిచిపోయాయి.
- మూడు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసిన 106 గ్రామాల్లో బుధవారం 20 చోట్ల సరఫరా పునరుద్ధరించారు.

వరద ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు

చింతూరు: ప్రజలు వరద ప్రాంతాల్లోకి వెళ్లకుండా తగిన చర్యలు చేపట్టాలని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం ఆయన చింతూరులోని వరద ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలు వాగులు దాటకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించిన ఆయన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్డీఆర్‌ఎఫ్ బృందానికి సూచనలు చేశారు. అనంతరం ఆయన పునరావాస కేంద్రానికి వెళ్లి బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు దుర్గాప్రసాద్, గోపాలకృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూనవరం: వరద ఎగువన తగ్గుముఖం పట్టినా కూనవరం మండలంలోని గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. సినిమాహాల్ సెంటర్ నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వరకు వరదనీరు చేరింది. దీంతో కూనవరం నుంచి టేకులబోరుకు రాకపోకలు స్తంభించాయి. శబరి బ్రిడ్జి మీదకు వరద నీరు ఎద్ద ఎత్తున చేరడంతో కూనవరం– వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటివల్ల టేకులబోరు నుంచి జగ్గవరం, కోతులగుట్టకు రాకపోకలు స్తంభించాయి. కూనవరం వద్ద బుధవారం సాయంత్రం గోదావరి నీటిమట్టం 6 గంటలకు 54.4 అడుగులు నమోదైంది. మండల ప్రత్యేకాధికారి భిక్షపతి, తహసీల్దార్ నాగబాబు, ఎంపీడీవో లక్ష్మీ రెడ్డి వరద పరిస్థితిపై సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఎటపాక: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినప్పటికీ మండలంలోని రాయనపేట, నెల్లిపాక, తోటపల్లి, నందిగామ వాగులకు వరద పోటు తగ్గలేదు. దీంతో రహదారులపై వరద కొనసాగుతోంది. నల్లకుంట, మురుమూరు, వీరాయిగూడెం గ్రామాలతో పాటు నెల్లిపాక నుంచి భద్రాచలం వెళ్లే జాతీయ రహదారి రాయనపేట వద్ద ముంపులోనే ఉంది.

పరిహారమిచ్చి పునరావాసం కల్పించాలి

వరద బాధితుల డిమాండ్

ఏటా వరదలతో ఇబ్బందులు పడుతున్న తమకు పోలవరం పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పించాలని పలుచోట్ల వరద బాధితులు ఆందోళన చేపడుతున్నారు. బుధవారం చింతూరు మండలం చట్టిలో వరదనీటిలో ఆందోళన చేపట్టిన గ్రామస్తులు తమ గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూనవరం మండలం గిన్నెలబజారులో కూడా వరద బాధితులు వరదనీటిలో ఆందోళన చేపట్టారు. గతంలో మూడు, నాలుగేళ్లకోసారి వరదలు వచ్చేవని, ప్రస్తుతం ఏటా రెండు, మూడు సార్లు వరద వస్తోందని, దీనివల్ల సర్వం కోల్పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు.



చింతూరు మండలం చట్టిలో ఆందోళన చేస్తున్న వరద బాధితులు

ఏటా జూలై నుంచి సెప్టెంబరు వరకు వరదలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు పోలవరం పరిహారం అందించి పునరావాసం కల్పించాలని బాధితులు కోరారు. వీఆర్‌పురం బీసీ కాలనీ వాసులు, శ్రీరామగిరి గ్రామస్తులు కూడా వరద నీటిలో ఆందోళన చేశారు.



కూనవరం: శబరి బ్రిడ్జిని ముంచెత్తిన వరద నీరు



చింతూరు: బ్రిడ్జి టెంట్లలో తలదాచుకుంటున్న వరద బాధితులు



చింతూరు: వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరినది



కూనవరం: శబరికొత్తగూడెం గ్రామస్తుల పునరావాస పాకలు

వరద రాజకీయాలు దేనికి?

- చేతనైతే బాధితులకు సాయం చేయండి
- గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణికి జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర కౌంటర్



మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వంలో ఉన్నవారు ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ఓదార్చి ఆదుకోవడం అనేది బాధ్యత అని, కానీ రాష్ట్రంలో కూటమి నేతలు బాధ్యతలను విస్మరించి వరద రాజకీయాలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు. గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం చింతపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంపై చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఆమె కౌంటర్ ఇచ్చారు. విశాఖపట్నంలోని జెడ్పీ అతిథి గృహంలో సుభద్ర బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదవాలో.. వాస్తవాలను తెలియజేయాలో అర్థంకాక గిరిజన శాఖ మంత్రి ఏదేదో మాట్లాడుతున్నారని ఆమె అన్నారు. ఒకపక్క భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పెద్ద ఎత్తున ప్రవహించడంతో కల్వర్టులు, వంతెనలు, రహదారులు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయని మంత్రి చెప్పారని.. దీనికి జగన్‌మోహన్‌రెడ్డి కారణమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చడం చేతగాక బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు గత ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధికి ఎవరు కృషి చేశారన్న విషయం ప్రజలకు తెలున్నారు. గిరిజన ప్రాంతాల్లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి నిరంతరం కృషి చేశారని, అందువల్ల అరకు, పాడేరు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా ఎక్కడ వరదొచ్చినా, ఎక్కడ వర్షాలు పడినా దానికి జగన్ ప్రభుత్వమే కారణమని కూటమి నేతలు చెప్పడాన్ని ఆమె తప్పుబట్టారు. వరదలకు జగన్ కారణమైతే గతంలో వచ్చిన కరోనాకు చంద్రబాబే కారణమా? అని నిలదీశారు.

మృతులకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండ చరియలు విరిగిపడి మృతి చెందిన గిరిజన మహిళ కుమారి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించాలని, గాయపడ్డ ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున సాయం చేయాలని ఈ సందర్భంగా సుభద్ర డిమాండ్ చేశారు. గిరిజనులపై ప్రేమ, అభిమానం నిజంగా కూటమి నేతలకు ఉంటే పరవాడలో బాధితులకు ఇచ్చిన విధంగా ఆర్థికంగా సాయం చేసి ఆదుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఆస్తి నష్టం, పంట నష్టం జరిగిందని, ప్రజలకు ధైర్యం చెప్పడానికి అధికారులు, కూటమి నేతలు రాకపోవడం దురదృష్టకరమన్నారు.

చట్రాపల్లికి ప్రత్యేక మోడల్ కాలనీ నిర్మించాలి

సీపీఎం డిమాండ్

సాక్షి, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో తుపాను కారణంగా కొండచరియలు విరిగిపడి ధ్వంసమైన చట్రాపల్లి గ్రామానికి తక్షణమే మోడల్ కాలనీని ప్రభుత్వమే నిర్మించి ఆదివాసీలకు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొండవాలు ప్రాంతమైన చట్రాయిపల్లి గ్రామంలో కొండచరియలు విరిగిపడి సుమారు 6 ఇళ్లు పూర్తిగా, 4 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయని, 21 ఇంటి లోపల నుంచి ఊటనీరు తేలిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో కొర్రా కుమారి (35) గల్లంతయ్యారని, ఒకే కుటుంబానికి చెందిన కొర్రా పందన్న, కొర్రా సుమిత్ర, కొర్రా సుబ్బారావులకు తీవ్ర గాయాలయ్యాయని, వారికి మెరుగైన వైద్యం ప్రభుత్వం అందించాలని కోరారు. 70 మేకలు, 60 కోళ్లతో పాటు గెమ్మెలి చంద్రయ్యకు చెందిన కిరాణా షాపు, గెమ్మెలి ప్రసాద్, పాంగి శ్రీనుకు చెందిన రెండు బైక్‌లు, ఆటో, రైస్‌మిల్లు షెడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఈ కొండ శిఖరాగ్ర గ్రామంలో 37 కుటుంబాలకు చెందిన 133 మంది ఆదివాసీలు జీవిస్తున్నారని, ఆ గ్రామానికి రహదారి, కమ్యూనికేషన్ నేటికి ప్రభుత్వం కల్పించకపోవడం అన్యాయమన్నారు.

శరవేగంగా రహదారుల పునరుద్ధరణ పనులు


కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: రహదారుల పునరుద్ధరణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు, ఎంపీడీవోలు,తహసీల్దార్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, తాగునీటి వనరులు, విద్యుత్ సమస్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌లంతా సచివాలయాల సిబ్బందిని సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో నష్టాలపై అంచనాలు రెడీ చేయాలని సూచించారు. గూడెంకొత్తవీధి– సీలేరు ప్రధాన రోడ్డును త్వరితగతిన పునరుద్ధరించాలని సూచించారు. ధారకొండ పంచాయతీలో తాగునీరు, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, చింతూరు డివిజన్‌లోని అన్ని మండలాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, డీపీవో కొండలరావు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


రికార్డు స్థాయిలో బలిమెల నీటిమట్టం



బలిమెల నుంచి విడుదల అవుతున్న వరదనీరు



డుడుమ జలాశయంలో తగ్గిన నీటి నిల్వలు



డొంకరాయి నుంచి రెండు గేట్లు ద్వారా నీటి విడుదల

సీలేరు: జలవిద్యుత్‌కు నీరందించే బలిమెల జలాశయానికి వరదనీరు పోటెత్తింది. గత పదేళ్ల తరువాత ప్రమాదస్థాయికి చేరుకుంది. వంద టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్ట్‌లో నీటిమట్టం బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రమాదస్థాయికి చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 20 వేల క్యూసెక్కులను గుంటవాడ (సీలేరు) రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయ నీటిమట్టం మరోసారి ప్రమాదస్థాయికి చేరుకుంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1360 అడుగులు కాగా ప్రస్తుతం 1354 అడుగులకు చేరింది. బలిమెల జలాశయం నుంచి వరద నీరు రానున్నందున ఏక్షణంలోనైనా ఈ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం మూడు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతోంది. అనంతరం విడుదల అవుతున్న నీరు డొంకరాయి జలాశయంలో చేరుతోంది.

రెండు గేట్ల ద్వారా 20 వేల క్యూసెక్కులు విడుదల

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన డుడుమ, జోలాపుట్టు జలాశయాల నీటి మట్టాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. గత మూడు రోజులుగా జలాశయాల నీటి మట్టాలు ప్రమాద స్థాయికి చేరుకోవడంతో అప్రమత్తమైన అధికారులు ఎన్నడూలేని విధంగా గేట్లు ఎత్తి వరద నీటిని విడుదల చేయడం తెలిసిందే.. ఇన్‌ఫ్లో తగ్గడంతో బుధవారం మధ్యాహ్నం జలాశయాల నుంచి వరద నీటి విడుదలను తగ్గించారు. డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2580 అడుగులుగా నమోదయింది. దీంతో 40 వేల క్యూసెక్కులను విడుదల చేసిన అధికారులు ప్రస్తుతం 5వేల క్యూసెక్కులకు తగ్గించారు. జోలాపుట్టు జలాశయం పూర్తి నీటి మట్టం 2750 అడుగులు కాగా ప్రసుత్తం 2747 అడుగులుగా నమోదయింది. నీటి విడుదలను 50 వేల క్యూసెక్కుల నుంచి ఐదు వేల క్యూసెక్కులకు తగ్గించారు. వర్షాలు సైతం తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో బాగా తగ్గిందని ప్రాజెక్ట్ అధికారవర్గాలు తెలిపాయి.

డొంకరాయిలో రెండు గేట్లు ఎత్తివేత

మోతుగూడెం: డొంకరాయి జలాశయంలో నీటి మట్టం పెరగడంతో బుధవారం సాయంత్రం రెండు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. సీలేరు నీటితోపాటు ఇతర వాగుల ద్వారా డొంకరాయి జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో పెరిగింది. అలాగే బలిమెల జలాశయం నుంచి కూడా రెండు గేట్లు ఎత్తి దిగువకు 20వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఈనీరు డొంకరాయికి చేరే అవకాశం ఉన్నందున అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. డొంకరాయి నీటి విడుదల నేపథ్యంలో దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెన్‌కో అధికారులు కోరారు. నీటి విడుదల విషయాన్ని చింతూరు ఐటీడీఏ పీవో ,ఇతర అధికారులకు తెలియజేశామని డొంకరాయి ప్రాజెక్టు అధికారవర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

డీసీసీ అధ్యక్షుడిగా బుల్లిబాబు నియామకం

పాడేరు : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అల్లూరి సీతారామరాజు, మన్యం పార్వతీపురం జిల్లాలకు అధ్యక్షుడిగా పాడేరుకు చెందిన సతక బుల్లిబాబును నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు



సిబ్బందికి సూచనలిస్తున్న రంపచోడవరం అదనపు జిల్లా వైద్యాధికారి శిరీష

రంపచోడవరం: రంపచోడవరం డివిజన్‌లోని ఫీడర్ అంబులెన్స్ సిబ్బందితో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. కో–ఆర్డినేటర్ శ్రీనివాసు, సత్తిబాబు, ఈఎంటీలు పాల్గొన్నారు.

బిడ్డల క్షేమం కోసం తరలివచ్చిన తల్లిదండ్రులు



కాలినడకతో సీలేరు వచ్చిన గిరిజనులు

సీలేరు: దుప్పిలవాడ పంచాయతీ బంధవీధి గ్రామానికి చెందిన ఐదుగురు గిరిజనులు 21 కి.మీ కాలినడకన బయలుదేరి కాలినడకన సీలేరు వచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి బీభత్సం చేసిన సంగతి తెలిసిందే. సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలను యోగక్షేమాలను తెలుసుకునేందుకు కాలినడకన ఉదయం 9 గంటలకు బయలుదేరి 21కి.మి కాలినడకన నడుచుకుంటూ 2 గంటలకు వచ్చినట్టు తెలిపారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

హుకుంపేట: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ బృందం డిపిహెచ్ఎన్‌వో భూలోకమ్మ, హెచ్‌వో కైలాస్ చెప్పారు. మండలంలోని తీగలవలస ఆరోగ్య, సంరక్షణ కేంద్రాన్ని వారు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తృతంగా వైద్య సేవలందించాలన్నారు. గ్రామాల్లో జ్వరపీడితులు ఎక్కువగా ఉంటే శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డీపీవో సతీష్, సిబ్బంది నాగమణి, భవాని తదితరులున్నారు.

చట్రాపల్లిని అన్నివిధాలా ఆదుకుంటాం

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



గ్రామస్తులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

గూడెంకొత్తవీధి: చట్రాపల్లిని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఐటీడీఏ పీవో అభిషేక్ హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న వారందరికీ ప్రత్యేక కాలనీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ గ్రామంలో కొండ చరియలు విరిగిపడి ఒకరు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం ఆయన గ్రామానికి జీపులో కొంతదూరం వెళ్లారు. అక్కడి నుంచి కాలినడక గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు.మృతురాలి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు.

గ్రామస్తులకు ఆయన నిత్యావసరాలు, నగదు ,వంటప్రాతలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన గ్రామస్తులతో కలిసి భోజనం చేశారు. గాయాలతో ఉన్న ముగ్గురిని చింతపల్లి కమ్యూనిటీ ఆస్పత్రిలో జాయిన్ చేయడంతో వారికి కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో చేపట్టిన పనులను పరిశీలించారు. అదే విధంగా మార్గంమద్యలో కొట్టుకుపోయిన రోడ్డుతోపాటు ,కోతకు గురైన ప్రాంతానికి సత్వరమే మరమ్మతులకు తగు చర్యు తగ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ షాపింగ్ కాంప్లెక్స్



పనులు అడ్డుకుని కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, జేఏసీ నాయకులు



కలెక్టర్ ఆదేశాలతో పనులు నిలిపివేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మత్స్యరాజు, సిబ్బంది

- నిర్మాణాన్ని అడ్డుకున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, జేఏసీ నాయకులు
- టీడీపీ సర్పంచ్, నిర్వాహకులపై చర్యలకు కలెక్టర్, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు

అరకులోయ రూరల్: అరకులోయలో పశుసంవర్ధక శాఖ స్థలంలో టీడీపీకి చెందిన సర్పంచ్ తదితరుల అండదండలతో సాగుతున్న అక్రమ నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. ఎమ్మెల్యే, జేఏసీ నాయకుల ఫిర్యాదుతో అధికారులు అక్రమణలకు అడ్డుకట్ట వేశారు. వివరాలు.. అరకులోయలో పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని ఆనుకుని బ్లాక్–బిలో సర్వే నంబర్ 29, 30లో ఉన్న 0.50 సెంట్ల ప్రభుత్వ స్థలంలో టీడీపీకి చెందిన పెదలబుడు పంచాయతీ సర్పంచ్ దాసుబాబు, కొంతమంది తెలుగుదేశం నాయకుల అండదండలతో గతేడాది పది దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభించారు. స్థానికులు, పశుసంవర్ధక శాఖ అధికారుల ఫిర్యాదుతో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ పనులు నిలిపివేశారు. సర్పంచ్, మరికొంతమంది అధికార పార్టీ నాయకులు కలిసి బుధవారం మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించారు. వెంటనే స్పందించిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర, నాయకులు, వేరువేరుగా కలెక్టర్ దినేష్‌కుమార్ ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ మత్స్యరాజు, సిబ్బందితో కలిసి పనులు నిలిపివేశారు. అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేసి పనులు చేయడంతో మరోసారి ఎమ్మెల్యే మత్స్యలింగం, జేఏసీ నాయకులు అక్కడికి చేరుకొని పనులు అడ్డుకున్నారు. కొద్దిసేపు సర్పంచ్, వారి వర్గీయులతో వాగ్వాదం చోటుచేసుకుంది. పనులు చేపడితే ఉపేక్షించేది లేదని అధికారులకు ఎమ్మెల్యే మత్స్యలింగం స్పష్టం చేశారు. అక్కడికి సమీపంలోనే అటవీశాఖ స్థలంలో ఓ గిరిజనేతరుడు కృష్ణారావు చేపడుతున్న నిర్మాణ పనులు కూడా అధికారులు తొలగించారు. మహదేవ్, ఆనంద్, అశోక్, బుద్ధు తదితరులున్నారు.

తృణధాన్యాలతో ఆరోగ్యం



గర్భిణి మహిళలకు సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలోని గర్భిణుల్లో రక్తహీనతను కొర్రలు, సామలు, తదితర తృణ ధాన్యాల వినియోగం ద్వారా నివారించవచ్చని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పౌష్టికాహార మసోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీ సందర్భంగా ఆయన పలు సూ,చనలు చేశారు. ఐదు మంది మహిళలకు సమూహిక సీమాంతలు: ఐసీడీఎస్ పీవో నీలిమ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. జెడ్పీటీసీ చటారి.జానకమ్మ, ఎంపీపీ ఈశ్వరి, ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో ఉషారాణి, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలీత, సర్పంచ్‌లు వెంకటరావు, హరి, వైకాపా పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరావు పాల్గొన్నారు.

డెంగ్యూ ప్రబలకుండా చర్యలు

- గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్



రంపచోడవరం : ఏజెన్సీ ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలల్లో డెంగ్యూ ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. మారేడుమిల్లి మండలం దేవరపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో నలుగురు విద్యార్థులకు సోకాయన్నారు. వీరిని మారేడుమిల్లి పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా జ్వర లక్షణాల ఆధారంగా డెంగ్యూ సోకిందని వైద్యాధికారులు తెలిపారన్నారు. పాఠశాలల ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, స్ప్రేయింగ్ చేయించాలని రంపచోడవరం పీవో ఆదేశించారన్నారు. ఇలావుండగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసిన 321 మంది సీఆర్టీలకు ఏపీ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఏడాదిపాటు రెన్యువల్ చేస్తున్నట్టు జాన్‌రాజ్ తెలిపారు.

'డయేరియా మరణాలు ప్రభుత్వ హత్యలుగా పరిగణించాలి'

- బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చింతపల్లి: మండలంలో జరిగిన డయేరియా మరణాలు ప్రభుత్వ హత్యలుగా పరిగణించి , బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పాడేరు ఎమ్మెల్యే మత్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

గిరిజన మంత్రి తీరుపై ధ్వజం

చింతలూరు గ్రామంలో వారం రోజుల వ్యవధిలో నలుగురు మృతి చెందడంతో గ్రామస్తులంతా ఈ ప్రాంతానికి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వినతిపత్రం అందించాలనుకున్న ఆమె వాహనాన్ని ఆపకపోవడం దారుణమని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ధ్వజమెత్తారు. లంబసింగి, చింతలూరు, అంతర్ల ప్రాంతాల్లో తుపాను వల్ల కలిగే నష్టాలపై మంత్రికి విన్నవించుకుందామని గిరిజనులు భావించినప్పటికీ ఆమె కనీసం స్పందించకపోవడం వాహనాన్ని ఆపకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు కోరారు. చింతపల్లి మండలం చింతలూరు గ్రామంలో అతిసారంతో మృతి చెందిన కుటుంబాలను ఆయన బుధవారం పరామర్శించారు. పెదవాడ పంచాయతీ పరిధిలో గల చింతలూరు గ్రామానికి చెందిన మృతులు కొర్రా ప్రకాష్, రాము, గెమ్మెలి రాంబాబు కుటుంబాలతో పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. గ్రామల్లో ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్ చల్లడంతోపాటు ఇంటింటికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి లక్ష్మీకాంతంతో మాట్లాడి గ్రామంలో నీటి పరీక్షలు నిర్వహించే అందిన ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీటి వ్యవస్థతో గతంలో మృతి చెందిన అంశాలపై ఆరా తీశారు. ఇంటింటికెళ్లి గిరిజనుల ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో బోరు బావి తొలగించడంతో గ్రామంలో తాగునీటికి కష్టాలున్నట్టు స్థానికులు ఎమ్మెల్యే వద్ద విన్నవించుకున్నారు. దీనిపై ఆయన స్పందించి రక్షిత మంచినీటి సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఆయనతోపాటు జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్యపడాల్, పెదబరడ సర్పంచ్ గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, చింతపల్లి, గూడెం కొత్తవీధి వైస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మోరి రవి, లక్ష్మణ్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, మాజీ ఎంపీపీ కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి ప్రసాద్ తదితరులున్నారు.

అటవీ అమరవీరులకు ఘన నివాళి



చింతపల్లిలో డీఎఫ్‌వో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ ఉద్యోగులు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రంలోని డివిజనల్ అటవీశాఖ కార్యాలయంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవులతో పాటు వన్యప్రాణుల పరిరక్షణకు సంబంధించి విధి నిర్వహణలో అమరులైన అటవీ అమరవీరుల చిత్రపటాలకు పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఇతర అధికారులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశాఖ సర్కిల్ అకౌంట్ అధికారి రాము, పాడేరు ఎఫ్ఆర్‌వో కె.శ్రీనివాసరావు, ఏవో విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: అటవీ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ మాట్లాడుతూ అటవీ ప్రాంతాలు రక్షించే దిశగా ప్రతి ఒక్కరు తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఏజెన్సీలో ఎంతో మంది అటవీ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాలు ఫలితంగానే ఈ ప్రాంతంలో అటవీ ప్రాంతం సమృద్ధిగా ఉందన్నారు. చింతపల్లి పెద్దవలస, లోతుగడ్డ, ఆర్.వి.నగర్ రెంజ్ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీ అమరవీరులకు స్థానిక అటవీ అధికారులు బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మృతి చెందిన పందిళ్లపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ర్యాలీలో పాల్గొన్నారు. అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొర ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పీవో పర్యటన



శబరికొత్తగూడెంలో ఐటీడీఏ పీవో భరత్‌కు సమస్యలను వివరిస్తున్న ఎంపీపీ రంగమ్మ తదితరులు

కూనవరం: గోదావరి వరద ప్రభావిత శబ్రికొత్తగూడెం గ్రామాన్ని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ బుధవారం సందర్శించారు. సుమారు 270 కుటుంబాలు వరద ముంపునకు గురికావడంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను పీవో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ కట్టం లక్ష్మి, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్, మాజీ సర్పంచ్ కట్టిశ్రీను, కుంజా శ్రీను పీఓని వరద బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత ప్రభుత్వంలో మండల పరిధిలోని ఏడు గ్రామాలను 41.15 కాంటూరు పరిధిలో చేర్చారని, సర్వేలు పూర్తిచేసి స్ట్రక్చర్ వ్యాల్యూ నిర్ధారణ అయినట్టు చెప్పారు. గ్రామస్తులకు ఆర్అండ్ ఆర్ ప్యాకేజి ఇప్పించి సమస్యల నుంచి విముక్తి చేయాలని కోరారు.

పరిహారం ఇప్పించాలని కోరుతూ జలదీక్ష

పోలవరం ప్యాకేజి ఇచ్చి. పునరావాస కేంద్రాలకు తరలించండి మహాప్రభో అంటూ బుధవారం పలువురు మండల కేంద్రంలో జలదీక్ష నిర్వహించారు. ఐటీడీఏ పీవో వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేదాక దీక్ష విరమించేది లేదని పట్టుబట్టారు. ఎట్టకేలకు స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు జోక్యం చేసుకొని పలు విధాలా నచ్చజెప్పి, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడించడంతో మహిళలు దీక్షను విరమించారు.

మంత్రి సంధ్యారాణి విమర్శలు దారుణం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సాక్షి,పాడేరు: జిల్లాలో వర్షాలతో ఏర్పడిన నష్టాలపై బాధిత ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ఉన్న గిరిజన మంత్రి సంధ్యారాణి వాటిని పట్టించుకోకుండా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వరదలతో రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయి రవాణా వ్యవస్థ దెబ్బతిన్నా యుద్ధప్రాతిపాదికన పనులు చేపట్టాల్సిన మంత్రి వాటిని పట్టించుకోకుండా రాజకీయాలు మాట్లాడడం సమంజసం కాదన్నారు. చట్రాపల్లిలో ఆదివాసీ మహిళ మృతి చెందిందని, తోటి గిరిజన మహిళగా ఆ కుటుంబానికి రూ.కోటి చెల్లించడంతో పాటు గాయాలపాలైన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాలకు కూలిన ప్రతి ఇంటికి పక్కా గృహాలు మంజూరు చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా రోడ్లు అభివృద్ధి చెందాయన్నారు. దారకొండ వెళ్లే ఘాట్ రోడ్డులో 10 కిలోమీటర్లు అధ్వాన రోడ్డును అభివృద్ధి చేశామని, అలాగే పాడేరు ఐటీడీఏ పరిధిలో రూ.204కోట్లతో 530 రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజనుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంతో పనిచేసిందని ఆమె స్పష్టం చేశారు. రోడ్లుతో పాటు గెడ్డలు.వాగులపై వంతెన నిర్మాణాలు చేపట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఆమె తెలిపారు. గిరిజన మంత్రి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

'రోగులకు మెరుగైన వైద్యసేవలు'

చింతపల్లి: రోగుల పట్ల సిబ్బంది, వైద్యులు అప్రమత్తంగా ఉంటూ సేవలు అందించాలని వైద్యవిధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణారావు ఆదేశించారు. బుధవారం ఆయన చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ పొందుతున్న రోగులను పరామర్శించారు. అన్ని వార్డుల్లోనూ అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. సూపరింటెండెంట్ ప్రభావతి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడి మృతి



నర్సింహారావు(ఫైల్)

ఎటపాక: భవన నిర్మాణ పనులు చేస్తుండగా ఓ కార్మికుడికి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించిన సంఘటన ఎటపాకలో బుధవారం జరిగింది. ఎటపాక ఎస్ఐ కె.పార్థసారది తెలిపిన వివరాల ప్రకారం..మారెళ్ల నర్సింహారావు(47) గత కొన్ని రోజులుగా ఎటపాకలోని గోసుల శ్రీను ఇంటి నిర్మాణ పనులుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పనుల్లో భాగంగా డాబాపైన తడి కర్రను పైకి లేపిన క్రమంలో అక్కడే ఉన్న విద్యుత్ మైయిన్‌లైన్‌కు తాకడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య దేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

గోదావరిలో పడి పశువుల కాపరి మృతి



సూరిబాబు మృతదేహం

ఎటపాక: పశువులు మేపేందుకు గోదావరి వరద ప్రాంతానికి వెళ్లి పశువుల కాపరి మృత్యువాత పడిన ఘటన బుధవారం ఉదయం గన్నవరం గ్రామం బాడిశవారిగుంపులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొలూరి సూరిబాబు(41) ఉద యం పశువులు తోలుకుని గోదావరి వరద ప్రాంతానికి వెళ్లగా.. అయితే ఈ క్రమంలో వరద నీటిలో కాలిజారి పడి సూరిబాబు గల్లంతయ్యాడు.ఈ సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్న సమయంలో సూరిబాబు మృతదేహం లభ్యం కావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవ పంచనామాకు మృతదేహాన్ని భద్రాచలం తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

సంఘటన స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం

వై.రామవరం: మండలంలోని దేవరమడుగుల గ్రామానికి చెందిన లోత సూరిరెడ్డి(33) ఆచూకీ లభించకపోవడంతో ఈనెల 6న అతని భార్య లోత వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు దేవరమడుగుల గ్రామం అటవీ ప్రాంతంలో సూరిరెడ్డి మృతదేహం ఉన్నట్టు అందిన సమాచారం మేరకు అడ్డతీగల సీఐ బి.నరసింహారావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది గ్రామస్తుల సహాయంతో కొండపైకి వెళ్లి మృతదేహాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. పాడైన మృతదేహాన్ని కిందకు తీసుకురాలేని పరిస్థితి కావడంతో సీఐ, ఎస్ఐలు స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ తీసుకొని కొండపైన సంఘటనా స్థలంలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఈ సందర్భంగా సీఐ నరసింహారావు మాట్లాడుతూ కొండపై అడవి జంతువుల వేటకు అమర్చిన విద్యుత్ తీగల్లో పడి చనిపోయి ఉండవచ్చనన్న అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన



చవిటిదిబ్బలులో శిక్షణకు హాజరైన సిబ్బందితో ఎంఏవో ఉషారాణి

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు సచివాలయంలో బుధవారం వ్యవసాయాధికారి ఉషారాణి అధ్యక్షతన ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకంపై సచివా లయాల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. బీమా చేసే విధానం, ప్రయోజనాలు, చేకూరే లబ్ధి తదితర అంశాలను వివరించారు. పంటకోత ప్రయోగం వలన దిగుబడి, పంట నష్టం అంచనా వేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విధుల నిర్వహణపై సలహాలు సూచనలిచ్చారు. అనంతరం పంటకోత ప్రయోగాలకు సంబంధించిన కిట్లను సిబ్బందికి అందజేశారు. ఎంఏవో ఉషారాణి, ఏఎస్ఓ ప్రవీణ్, డివైఎస్‌వో శ్రీదేవి, వీఏఏలు, వీహెచ్ఏ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు తీవ్రగాయాలు



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న అచ్చియమ్మ

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామంలో విద్యుత్‌షాక్‌తో కురసాల అచ్చియమ్మ(32) అనే మహిళ తీవ్ర గాయాలుపాలైంది. ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ తెలియజేసిన వివరాలివి...గంగవరం మండలం మోహనాపురం గ్రామానికి చెందిన దంపతులు సుబ్బారావు, అచ్చియమ్మ పి.యర్రగొండ బంధువుల ఇంటికి వచ్చారు. బుధవారం ఉదయం భార్య అచ్చియమ్మ మేడపైకి వెళ్లి దుస్తులు ఆరవేస్తుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లకు తగిలి తీవ్రగాయాలపాలైంది. ఆమెన స్థానిక సీహెచ్‌సీకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆమె భర్త సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

కాలువలో పడి దివ్యాంగురాలు మృతి

ఒక రోజు తర్వాత లభ్యమైన మృతదేహం



హిందుజ మృతదేహం

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ గోధుమలంకలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పాంగి హిందుజ (13)మృతదేహం బుధవారం గ్రామం పక్కనే ఉన్న కాలువలో కనిపించింది. హిందుజ దివ్యాంగురాలు.ఆమెకు చెవుడు, మూగ, మాటలు రావు. మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి ఆనుకుని ఉన్న పొలం దగ్గరకు వెళ్లింది. ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. ఆ సమయంలో ఆమెను రక్షించేందుకు ఎవరు లేకపోవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న మునిగిపోయింది. బయటకు వెళ్లిన కూతురు ఎంతకు రాకపోవడంతో తండ్రి సన్యాసిరావు గ్రామస్తులతో కలిసి వెతికారు. బుధవారం ఉదయం ఆమె మృతదేహాన్ని కాలువ వద్ద తుప్పల్లో చిక్కుకుపోయి ఉండడాన్ని చూశారు. భారీ వర్షాలతో కాలువ ఉధృతంగా రావడంతో హిందుజ కాలువలో పడిపోయిందని తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కాలువలో పడి మృతి చెందిన హిందుజకు పింఛన్ మంజూరు చేయించేందుకు చాలా ప్రయత్నించామని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ తెలిపారు. ఆ కుటుంబంలో నలుగురు పిల్లలు కూడా దివ్యాంగులుగా ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది వేసవిలో కొడుకు మృతి చెందారని, ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు.